## రోడ్ షోను విజయవంతం చేయాలి

ఊట్కూర్, నవంబర్ 21: మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రోడ్ షో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, శివరామరాజు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మక్తల్ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి మద్దతుగా మంత్రి నిర్వహించే రోడ్ షోకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## అభివృద్ధి ప్రదాతకు పట్టం కట్టండి

- బీఆర్ఎస్ నాయకుడు చిట్టెం చాణక్యరెడ్డి



మిట్టనందిమల్లలో ప్రచారం నిర్వహిస్తున్న చిట్టెం చాణక్యరెడ్డి

అమరచింత, నవంబర్ 21: నియోజకవర్గంతోపాటు మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని బీఆర్ఎస్ నాయకుడు, ఎమ్మెల్యే చిట్టెం తనయుడు చిట్టెం చాణక్యరెడ్డి కోరారు. మంగళవారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలసి మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ప్రజలకు ప్రభుత్వ సేవాలను సూలువుగా అందించేందుకు వేయి జానాభా కలిగిన చిన్న, చిన్న గ్రామాలను సీఎం కేసీఆర్ నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో ప్రియదర్శిని జూరాల ముంపు గ్రామాల నిర్వాసితులకు కొత్తగా ఇంటి స్థలాలతో పాటు మండలంలోని చింతరెడ్డిరెడ్డిపల్లి, మిట్టనందిమల్ల, కృష్ణంపల్లి, నందిమల్ల ఎక్స్‌రోడ్డు గ్రామాలను నాలుగు నూతన గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత చిట్టెం రామ్మోహన్‌రెడ్డిదేనన్నారు. కారుగుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే చిట్టెను మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, సర్వారెడ్డి, చెన్నమ్మ, రాజేశ్వరమ్మ, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు ఆసిరెడి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- జిల్లా ఎన్నికల పరిశీలకుడు బీపీ చౌహాన్
- పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు చౌహాన్

అమరచింత, నవంబర్ 21: ఈనెల 30 వ తేదిన జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మండల ప్రజలు సహకరించాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు బీపీ చౌహాన్ అన్నారు. మంగళవారం ఆయన మండల అధికారులతో కలిసి మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాల, బాలికల పాఠశాల, మాస్తీపూర్ జెడ్పీ పాఠశాల, నందిమల్ల జెడ్పీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ శ్రీహర్ష, నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆదేశంతో మక్తల్ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, అధికారులకు తగిన ఏర్పాట్లు చేయాలని మండల అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐ గోపాల్, సీనియర్ అసిస్టెంట్ వెంకటయ్య తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ వస్తే కష్టాలు తప్పవు

- బీఆర్ఎస్ హయాంలో గౌడన్నలకు పెరిగిన ఆత్మాభిమానం
- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్‌టౌన్, నవంబర్ 21: కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే గౌడకులస్తులకు కష్టాలతోపాటు, కులవృత్తిపైన పెనుభారం పడుతుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు. మంగళవారం మక్తల్ పట్టణంలోని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాసంలో నారాయణపేట జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్తల్ నియోజకవర్గ గౌడకులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ.నెం.767,567 తెచ్చి రాష్ట్రంలో కల్లు విక్రయించకుండా గౌడకులస్తులను ఇబ్బదులకు గురిచేసిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం కల్లుగీతకార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకా సీఎం కేసీఆర్ పాలనలో గీతకార్మికులపై గత ప్రభుత్వ హయాంలో ఉన్న కేసులను, బఖాయిలను మాఫీచేసి, గీత కార్మికుల ఆత్మాభిమానం పెంపొందేలా చేశారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని నమ్మితే గీతకార్మికులకు గతంలో జరిగిన అనుభవాలే మళ్లీ పునరావృతం అవుతాయని అన్నారు. మక్తల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నమ్మితే, దౌర్జన్యాలు, అల్లర్లు తప్ప మరేమి ఉండవన్నారు. గీతకార్మికులు ఆత్మాభిమానంతో ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారుగుర్తుపై ఓటువేసి, అత్యధిక మెజార్టీతో మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి సభ్యురాలు చిట్టెం సుచరితారెడ్డి, ఊట్కూర్ జెడ్పీటీసీ అశోక్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, ఎంపీటీసీలు నర్సింహాగౌడ్, నాయకులు వెంకటయ్యగౌడ్, సుదర్శన్‌గౌడ్, సోంభూపాల్‌గౌడ్, నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ముమ్మర ప్రచారం

మక్తల్, నవంబర్ 21: మక్తల్ మండలం రుద్రసముద్రం గ్రామంలో మంగళవారం సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ వెంకటయ్య, చిట్టెం యువసేన అధ్యక్షుడు హుసేన్‌పాషా ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి చిట్టెం రాంమోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అలాగే సంగంబండ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సత్యారెడ్డి, పారేవుల రవీందర్‌రెడ్డి తదితరులు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓట్ల కోసం మాయ మాటలు చెప్పి మోసం చేస్తారని వారి మాటలు నమ్మొద్దన్నారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి కోసం చిట్టెం రామోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### భారీ మెజార్టీతో గెలిపించాలి


ఊట్కూర్, నవంబర్ 21: ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సర్పంచుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వారు చిట్టెంకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, షాదీముభారక్, ఆసరా పింఛన్లు ఇస్తున్న సంక్షేమాల ప్రభుత్వానికి మద్దతు తెలపాలన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి హ్యాట్రిక్ విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివరామరాజు, తిరుపతిగౌడ్, కావలి శ్రీహరి, హన్మంతు, నర్సింహారాజ్‌గౌడ్, గోవిందరాజులు, శివరాములు, వెంకటేశ్‌గౌడ్, ఆనంద్‌రెడ్డి, తరుణ్, షేక్‌షమి, ఒబేదుర్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.



మక్తల్ మండలం సంగంబండలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### ఆలోచించి ఓటెయ్యండి

ఆత్మకూరు, నవంబర్ 21: మోసపూరిత వాగ్ధానాలు నమ్మి ఆగంకాకండి, ఎన్నికల్లో ఆలోచించి సంక్షేమం, అభివృద్ధికి పాటుపడే వారికి ఓటెయ్యాలని మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చుట్టం చూపుగా వచ్చే నాయకుల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మోసపూరిత హామీలతో ఓట్లు వేయించుకోవాలని చూస్తు న్నాయన్నారు. కర్నాటకలో కాం గ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఎంత వర కు అమలవుతున్నాయో ఓసారి ప్రజలు ఆలోచించాలని కోరారు. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్‌తోనే వ్యవసాయ మనుగడ సాధ్యమని అన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే ధరణితో భూములకు భద్రత ఏర్పడిందని, సంబంధించిన రికార్డులు సహితం సరళీకృతం కాబడ్డాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ గెలిస్తేనే సంక్షేమం, అభివృద్ధి ముందుకు సాగుతాయని అన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే చిట్టెం రామన్న ఆశీస్సులతో మున్సిపాలిటిలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. నియోజకవర్గాన్ని సహితం ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేసుకున్నామని, అధికారంలోకి వచ్చిన నెలలోనే ఆత్మకూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసుకుందామని ఓటర్లను అభ్యర్థించారు. ఈవీఎం మిషన్‌పై అవగాహన కల్పిస్తూ ప్రతీఒక్కరూ ఆలోచించి కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, ఆయా వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బూత్ స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో ప్రచారం చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి



ఊట్కూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు